క్లుప్తంగా

అందరికీ నెగెటివ్

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి లో కరోనా నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం 12 మందికి కోవిడ్ ర్యాపిడ్ టెస్టులు నిర్వహించారు. అందులో అందరికీ నెగెటివ్ వచ్చిందని నిర్వాహకుడు మనోహర్ తెలిపారు. అదేవిధంగా ఆర్టీపీసీఆర్ టెస్టులు చేయలేదన్నారు

12న భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కార్యాలయంలో భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ పీయఫ్ కమిషనర్ డాక్టర్ హేమంత్ తెలిపారు. ఈ నెల 12వ తేదీ కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్టీసీ బస్ టెర్మినల్‌లోని రెండవ అంతస్తులో గల పీఎఫ్ కార్యాలయంలో ఉంటుందని ఖాతాదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవటమే కాకుండా సలహాలు, సూచనలు అందించాలని కోరారు. కూకట్‌పల్లి, మియాపూర్, లింగంపల్లి, బీహెచ్‌ఈఎల్, జీడిమెట్ల, సనత్‌నగర్ ఖాతాదారులు పాల్గొనవచ్చని తెలిపారు.

లిటరరీ క్లబ్ కార్యక్రమాలను విస్తృతం చేస్తాం

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో యూనివర్సిటీ లిటరరీ క్లబ్ (యూఎల్‌సీ) కార్యక్రమాలను మరింత విస్తృత పరుస్తామని యూనివర్సిటీ స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ సయ్యద్ అలీమ్ అష్రఫ్ జైసీ పేర్కొన్నారు. ఉర్దూ యూనివర్సిటీలోని లిటరరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు కార్యక్రమాల ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. అంతకుముందు 'ఉన్నత విద్యలో ముస్లీమ్‌లు' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు.

స్ట్రీట్ వెండర్స్‌కు గొడుగుల పంపిణీ



వీధివ్యాపారులకు భారీ గొడుగులను అందచేస్తున్న సాయిబాబా

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడలో శుక్రవారం వీధివ్యాపారుల (స్ట్రీట్ వెండర్స్)కు భారీ గొడుగులను పంపిణీ చేశారు. చేవెళ్ళ పార్లమెంటు సభ్యుడు డాక్టర్ రంజిత్‌రెడ్డి పంపించిన గొడుగులను మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునే వారికి ఎండ, వర్షంతో ఇబ్బందులు పడకుండా భారీ గొడుగులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు దారుగుపల్లి నరేష్, జంగయ్యయాదవ్, చెన్నంరాజు, రాజుముదిరాజ్, అంజమ్మ, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు బురిడీ

పటాన్‌చెరు టౌన్: సైబర్ వలలో పడి ఇద్దరు మహిళా సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు మోసపోయారు. అమీన్‌పూర్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అమీన్‌పూర్ పరిధిలోని ప్రణీత్ ప్రణవ్ పనోరమకు చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి మే 10 వ తేదీన పార్ట్ టైం జాబ్ ఆఫర్ అంటూ మెసేజ్ వచ్చింది. దీంతో ఆమె తన వివరాలు నమోదు చేసింది. టాస్క్ పేరిట నగదు పెట్టుబడి పెట్టించాడు. చివరికి తాను పెట్టిన రూ.1.20 లక్షలు, రెట్టింపైన నగదును ఇవ్వాలని మెస్సేజ్ చేయగా స్పందన రాలేదు. దీంతో ఆమె తాను మోసపోయినట్టు గుర్తించి సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేసిన అనంతరం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

◆ అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ జయలక్ష్మీ నగర్‌కు చెందిన మరో సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి మే 29వ తేదీన పార్ట్ టైం ఉద్యోగం మెసేజ్ వచ్చింది. దీంతో బాధితురాలు తన వివరాలను నమోదు చేసి అపరిచితులు చెప్పిన విధంగా నగదు పెట్టుబడి పెట్టింది. చివరకు తాను పెట్టిన రూ.8.40 లక్షలు, రెట్టింపైన నగదును ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితురాలు తాను మోసపోయినట్టు గ్రహించి అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేపట్టారు.

పాలాభిషేకం

పటాన్‌చెరు టౌన్: 60 ఏళ్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ నెరవేర్చిందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాలి అనిల్ కుమార్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గడ్డం శ్రీశైలం, శ్రీకాంత్‌రెడ్డి, పటాన్‌చెరు మండల అధ్యక్షుడు సుధాకర్‌గౌడ్, కృష్ణ, నర్సింగ్‌రావు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్లు, ఇతర నాయకులు



చందానగర్‌లోని జీహెచ్‌ఎంసీ కార్యాలయం వద్ద.. కార్పొరేటర్ మంజులారెడ్డి, అధికారులు, నాయకులు



గోల్కొండలో నిర్వహించిన అవతరణ వేడుకల్లో బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్, శేరిలింగంపల్లి నాయకులు

దశాబ్ది సంబరాలు

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలు శుక్రవారం అట్టహాసంగా ఆరంభమయ్యాయి. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ళ పరిధిలో జాతీయ పతాకావిష్కరణలు చేశారు. మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన పతాకావిష్కరణలో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు హమీద్‌పటేల్, దొడ్ల వెంకటేష్‌గౌడ్, రాగం నాగేందర్‌యాదవ్, జగదీశ్వర్‌గౌడ్, నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, మంజులా రఘునాథ్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

– శేరిలింగంపల్లి జోన్ బృందం



దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు



స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో.. డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీ, సిబ్బంది



ఖాజాగూడలో.. మాజీ కార్పొరేటర్ సాయిబాబా, బీఆర్‌ఎస్ నాయకులు



శేరిలింగంపల్లి ఎల్లమ్మబండ పాపిరెడ్డినగర్‌లో.. బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి డా.కొరదాల నరేష్



కొండాపూర్‌లోని 8వ బెటాలియన్‌లో.. పతాకావిష్కరణ చేసిన కమాండెంట్ మురళీకృష్ణ



మాదాపూర్ శిల్పారామంలో.. ప్రత్యేకాధికారి కిషన్‌రావు తదితరులు



పటాన్‌చెరులో.. జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి



అమీన్‌పూర్‌లో.. మున్సిపల్ చైర్మన్ పాండురంగారెడ్డి



సైబరాబాద్ కమిషనరేట్‌లో గౌరవవందనం స్వీకరిస్తున్న డీసీపీ రితిరాజ్

ప్రజల భాగస్వామ్యంతోనే అంతర్జాతీయ గుర్తింపు



హోంమంత్రి చేతుల మీదుగా సర్టిఫికెట్‌ను అందుకుంటున్న నీలం మధు ముదిరాజ్

పటాన్‌చెరు టౌన్: ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి చేసే గ్రామపంచాయతీలను ప్రభుత్వం గుర్తించి సర్పంచ్‌లను గౌరవించడం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఘనత అని ఆ పార్టీ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ తెలిపారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలలో రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమ్మద్ అలీ, జిల్లా కలెక్టర్ శరత్, జెడ్పీ చైర్మన్ మంజుశ్రీ చేతుల మీదుగా హెచ్‌వైఎం అంతర్జాతీయ గుర్తింపు ప్రశంసపత్రం ఇచ్చి సత్కరించారు.

కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి కవిత, ఉపసర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, వార్డు సభ్యులు కృష్ణ, మురళీ, వెంకటేశ్, ఆంజనేయులు, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు ప్రశాంత్, మాజీ నీటి సంఘం చాకలి వెంకటేశ్, యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వరంబండ, కర్దనూర్‌లకు ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్

పటాన్‌చెరు మండల పరిధిలోని రామేశ్వరంబండ, కర్దనూర్ గ్రామాలకు కూడా హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా పొందిన ఐఎస్ఓ 9001–2015 సర్టిఫికెట్‌ను సంగారెడ్డిలో రామేశ్వరంబండ సర్పంచ్ ధరణి అంతిరెడ్డి, అదేవిధంగా కర్దనూర్ సర్పంచ్ భాగ్యలక్ష్మి, కార్యదర్శి నీలిమ అందుకున్నారు. సర్టిఫికెట్ రావడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

మురుగు సమస్య



మియాపూర్‌లో లక్కీ రెస్టారెంట్ పక్క రోడ్డులో ప్రవహిస్తున్న మురుగు

మియాపూర్: కాలనీల ప్రధాన రహదారులపై మురుగు పారుతుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆయా ప్రాంతాలలోని హోటళ్ల నుంచి వచ్చే డ్రైనేజీ పైప్‌లైన్లను కాలనీల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి కలపడం.. దీనికితోడు డ్రైనేజీ పైపులైన్ సామర్థ్యం తక్కువగా ఉండడంతో తరచు మ్యాన్‌హోళ్ల నుండి మురుగు బయటకు వస్తోంది. కనీసం రోడ్లపై నడిచేందుకు కూడా వీలు లేకుండా ఉంది. ఫిర్యాదు చేసిన ప్రతిసారి సిబ్బంది తూతూ మంత్రంగా బాగు చేసి వెళ్తున్నారని ఆయా కాలనీల వాసులు వాపోయారు. మియాపూర్‌లోని దీప్తిశ్రీనగర్ ధర్మపురి టెంపుల్ రోడ్డు, దత్తసాయి కాలనీ, లక్ష్మీనగర్ లక్కీ రెస్టారెంట్ వెనుక ఉన్న ఆదిత్యానగర్ కాలనీలోని ప్రధానరోడ్లపై మురుగు ఏరులై పారుతోంది. దీంతో దుర్వాసన భరించలేకపోతున్నామని, మురుగునీటి కారణంగా దోమలు వృద్ధి చెంది రోగాల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక కాలనీల్లో జీ ప్లస్ 2 అనుమతులు తీసుకొని మరో రెండు అంతస్తులు అదనంగా నిర్మిస్తుండడంతో పరిమితి కంటే ఆ భవనాల్లో ఎక్కువగా నివాసముంటున్నారు. గతంలో ఏర్పాటు చేసిన పైపులైన్లు చిన్నవిగా ఉండడం.. కాలనీల్లో జనాభా ఎక్కువ కావడంతో పైపులైన్ల సామర్థ్యం చాలక మ్యాన్‌హోళ్ల నుంచి మురుగు రోడ్లపై పారుతోంది. దీంతో రాకపోకలకు కష్టంగా ఉందని ,ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.



మియాపూర్ దత్తసాయి కాలనీలో..



ధర్మపురి దేవాలయం రోడ్డులో..

నేటి నుంచి మనూలో 'జష్న్- ఏ-బహారన్'

రాయదుర్గం: మనూలో సాంస్కృతిక, సాహిత్య, స్పోర్ట్స్ ఫెస్టివల్‌ను 'జష్న్- ఏ-బహారన్' పేరిట నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఉత్సవాలు శనివారం ప్రారంభమవుతాయి. యూనివర్సిటీ స్టూడెంట్స్ యూనియన్ పర్యవేక్షణలో, డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ వరకు నిర్వహిస్తారు. శనివారం ఉదయం 8 గంటలకు యూనివర్సిటీ క్యాంపస్‌లోని ధ్యాన్‌చంద్ స్పోర్ట్స్ గ్రౌండ్‌లో కార్యక్రమాలు ప్రారంభిస్తారు. జూన్ 12న మెగా జాబ్ ఫెయిర్‌తోపాటు వివిధ సాహిత్య, సాంస్కృతిక, క్రీడాపోటీలు నిర్వహిస్తామన్నారు.

డీఎస్‌టీ జియోస్పేషియల్ హ్యాకథాన్-2023 విజేతలు వీరే

రాయదుర్గం: డీఎస్‌టీ జియోస్పేషియల్ హ్యాకథాన్–2023 విజేతలుగా నలుగురిని ఎంపిక చేశారు.గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీలోని సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (సీఐఈ) పర్యవేక్షణలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ) జియోస్పేషియల్ హ్యాకథాన్–2023 చివరి ఈవెంట్ నిర్వహించింది. ఇందులో శుక్రవారం నలుగురిని విజేతలుగా ఎంపిక చేశారు. ఫైజాన్‌ఖాన్(హైరిజల్యూషన్, డైనమిక్, కచ్చితమైన వాతావరణ సూచన-ఏపీఐ), ధనశ్రీ పాటిల్(యాప్, జియోస్పేషియల్ డేటా ద్వారా యూఎన్ ఎస్‌డీజీ లక్ష్యాలను కొలిచే యాప్), అంబరీష్ గంగూలీ(సామాజిక-ఆర్థిక డేటా జియోస్పేషియల్ డేటాతో పాటు పట్టిక డేటాతో ఏకీకృతం చేయబడింది), వీఎస్‌ఎస్ కిరణ్ (ముడి వచనం(టెక్స్ట్) నుంచి ముందే నిర్వచించబడిన ఎంటీటీల సెట్‌ను సంగ్రహించడానికి, నేపథ్య మ్యాప్‌లను రూపొందించడానికి సంబంధించిన జియో కృత్రిమ మేధ ఎంటీటీ (సంస్థ రిగగ్నిషన్ మోడల్) గెలుపొందినవారిలో ఉన్నారు. ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌లోని సీఐఈ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ, సర్వే ఆఫ్ ఇండియా, మైక్రోసాఫ్ట్ సహకారంతో ఈ ఈవెంట్ నిర్వహించారు. 500 కంటే ఎక్కువ దరఖాస్తులు రాగా చివరి రౌండ్‌కు 70 ఎంపిక చేశారు.

గీతంలో జిమ్ ప్రారంభం

పటాన్‌చెరు టౌన్: గీతం హైదరాబాద్ ప్రాంగణంలోని ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో విద్యార్థుల కోసం నూతనంగా ఏర్పాటుచేసిన 'క్యాంపస్ జిమ్'ను ప్రోవీసీ (క్యాంపస్ లెఫ్ట్) డాక్టర్ కె.గౌతమరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యం కోసం విద్యార్థులు, అధ్యాపకులకు వ్యాయామం అవసరమన్నారు. జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యాయామశాల షెడ్యూలు ప్రకారం విద్యార్థులు దీనిని వినియోగించుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరెక్టర్ వినయ్ కుమార్ అప్పరాజు, స్పోర్ట్స్ డైరెక్టర్ అరుణ్ కార్తీక్, మానవ వనరుల విభాగం డైరెక్టర్ ఆర్.శివకుమార్ పాల్గొన్నారు.

వరదనీటి కాల్వ పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్ : ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. శుక్రవారం మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీలో రూ.30లక్షలతో నూతనంగా చేపడుతున్న వరదనీటి కాల్వ నిర్మాణ పనులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫోన్ పోయిందని దిగులుపడొద్దు

పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: మొబైల్ ఫోన్ పోయిందని దిగులుపడొద్దని సీఈఐఆర్ ద్వారా ఫోన్ ట్రాక్ చేయవచ్చని పటాన్‌చెరు సీఐ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు పోలీసుస్టేషన్‌లో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ఇద్దరికి వారి ఫోన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌కు చెందిన ఇద్దరు పది రోజుల క్రితం తమ ఫోన్ పోగొట్టుకొన్నారు. వెంటనే వారు పటాన్‌చెరు పోలీసుస్టేషన్‌లో సంప్రదించగా మీ–సేవలో ఫిర్యాదు చేయించి, అనంతరం సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేయించారు. పోగొట్టుకున్న రెండు ఫోన్‌లను గుర్తించి బాధితులకు శుక్రవారం అందజేశామన్నారు. ప్రజలు ఎవరైనా తమ సెల్‌ఫోన్ పాగొట్టుకుంటే సీఈఐఆర్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.



ఫోన్ అందజేస్తున్న సీఐ వేణుగోపాల్‌రెడ్డి, క్రైం సీఐ లాలునాయక్

కొండాపూర్ జిల్లా ఆస్పత్రికి 'కాయకల్ప అవార్డు'

- రాష్ట్రంలోనే మొదటి స్థానం
- రూ.60 లక్షల నజరానా
- ఎకో ఫ్రెండ్లీ కేటగిరీలో మొదటి స్థానం
- రూ.10 లక్షల నగదు బహుమతి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పేదలకు వైద్య సేవలందిస్తున్న కొండాపూర్ జిల్లా ఆస్పత్రికి 'కాయకల్ప అవార్డు' దక్కింది. రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచి రూ.50 లక్షల నగదు అందుకోనుంది. ఎకో ఫ్రెండ్లీ కేటగిరీలోను మొదటి స్థానంలో నిలవడంతో మరో రూ.10 లక్షల నగదు బహుమతిని కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ శ్వేత మహంతి ప్రకటించారు. నేషనల్ హెల్త్ మిషన్, కమిషనర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, క్వాలిటీ అష్యూరెన్స్ టీమ్ ఏప్రిల్ 28న కొండాపూర్ ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. స్వచ్ఛత, ఇన్‌ఫెక్షన్ సోకకుండా తీసుకుంటున్న జాగ్రత్తలు, రోగులు, వారి కుటుంబ సభ్యులకు అందుతున్న సదుపాయాలు, బయో మెడికల్ వేస్టేజ్, పారిశుద్ధ్యం, సిబ్బంది పని తీరు, రికార్డుల నమోదు తదితర అంశాలపై అధ్యయనం చేశారు. 2022–23 ఏడాదికి గాను జిల్లా ఆస్పత్రుల కేటగిరీలలో కొండాపూర్ ఏరియా జిల్లా ఆస్పత్రి 92.13 శాతం స్కోర్‌తో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది.

కరపత్రాల పంపిణీ

గచ్చిబౌలి: రవాణ శాఖ అందించే సేవలను వివరిస్తూ ప్రత్యేకంగా రూపొందించిన కరపత్రాలను ఆ శాఖ అధికారులు శుక్రవారం పంపిణీ చేశారు. అంతకుముందు దశాబ్ది ఉత్సవాలను కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌రెడ్డి, విజయరావు, వాసు జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న రవాణశాఖ అధికారులు